

రేపు నషా ముక్త్ భారత్ అభియాన్ ప్రతిజ్ఞ : కలెక్టర్

పార్వతీపురం, ఆగస్టు10(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ఈ నెల 12న నషా ముక్త్ భారత్ అభియాన్ ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని చేపట్టాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో సమీక్షించారు. మాదకద్రవ్యాల వినియోగాన్ని నివారించడానికి ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ఇందులో అధికారులంతా భాగస్వాములవ్వాలని సూచించారు. విద్యాలయాలు, ఇనిస్టిట్యూట్‌లు, ఇతర ప్రజాసంస్థల్లో ఈ కార్యక్రమం చేపట్టాలన్నారు. విద్యార్థులు, యువత, ఉద్యోగులు తదితర అన్ని వర్గాలతో ప్రతిజ్ఞ చేయించాలని ఆదేశించారు.



ఎందుకిలా..?

- ఐటీడీఏ పీవోల బదిలీలపై విమర్శలు
- తరచూ అధికారుల స్థానభ్రంశం
- ఇలాగైతే ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధి ఎలా?
- కూటమి ప్రభుత్వం దృష్టి సారించాలని గిరిజనుల విన్నపం

పార్వతీపురం, ఆగస్టు10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏల పీవోలను రోజుల వ్యవధిలోనే బదిలీ చేయడం సర్వత్రా చర్చనీయాంశమవుతోంది. ఆదివాసీ దినోత్సవం రోజునే వారికి స్థానచలనం కల్పిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడం.. అందర్నీ ఆశ్చర్యానికి గురిచేసింది. వాస్తవంగా ప్రాజెక్టు అధికారులకు ఏజెన్సీ ప్రాంతాల్లో సమస్యలతో పాటు గిరిజనుల జీవన స్థితిగతులను తెలుసుకునేందుకు కనీసం ఆరు నెలల సమయం పడుతుంది. ఆ తర్వాతనే పీవో ఆధ్వర్యంలో ఐటీడీఏలో పాలన గాడి పడుతుంది. అయితే రోజుల వ్యవధిలోనే ప్రాజెక్టు అధికారులను బదిలీలు చేయడం వల్ల గిరిజన ప్రాంతాల అభివృద్ధి ఎలా సాధ్యమనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

గత వైసీపీ సర్కారు పాలనలో..

వాస్తవంగా గత వైసీపీ సర్కారు జిల్లాలో రెండు ఐటీడీఏలను పూర్తిగా నిర్వీర్యం చేసింది. నిధుల కేటాయింపు, పథకాల అమలుకు మంగళం పాడేసింది. పీవోలకు ఏ అధికారాలు లేకుండా చేసింది. తరచూ అధికారుల మార్పులు, చేర్పులు చేసింది. దీంతో ఐటీడీఏల పరిస్థితి దారుణంగా మారింది. గిరిజనులకు కూడా పూర్తిస్థాయిలో సేవలందలేదు. గత ఐదేళ్లు గ్రీవెన్స్‌లో ఇచ్చిన వినతులకు కూడా పరిష్కారం లభించేది కాదు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ పరిస్థితి మారుతుందని అంతా ఆశించారు. కానీ అధికారుల బదిలీల్లో మార్పు ఉండడం లేదు. సహజంగా కొత్త ప్రభుత్వం కొలువుదీరినప్పుడు బదిలీలు సహజం. అయితే ఐటీడీఏలకు కేటాయించిన పీవోలను రోజులు, నెలల వ్యవధిలోనే స్థానచలనం కల్పించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పీవోలుగా నియమించిన వారికి పనిచేసే అవకాశం ఇవ్వకుండానే.. ఎందుకు బదిలీలు చేస్తున్నారో.. కారణాలేమిటో తెలియరావడం లేదు. మొత్తంగా ఐటీడీఏలకు పీవోలుగా ఎవరు ఎప్పుడు ఉంటారో.. ఎన్ని రోజులు పనిచేస్తారో తెలియని పరిస్థితి ఏర్పడింది.

తీరు మారాలి...

సీతంపేట, పార్వతీపురం ఐటీడీఏల పీవోల నియామకంపై ప్రభుత్వం తీరు మారాలని గిరిజనులు, ప్రజా సంఘాల నాయకులు కోరుతున్నారు. నెలలు, రోజులు వ్యవధిలో బదిలీలు చేయడం వల్ల గిరిజన ప్రాంతాలు అభివృద్ధి సాధ్యపడదని వారంటున్నారు. బాధ్యతలు చేపట్టే అధికారులు కూడా ఏజెన్సీపై, పాలనపై దృష్టి సారించలేరని వెల్లడిస్తున్నారు. ఈ విషయంలో ప్రభుత్వం ఒక ప్రణాళికతో ముందుకు వెళ్లాలని, అన్ని కోణాల్లో ఆలోచించి ప్రాజెక్టు అధికారులను నియమించాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్పష్టం చేస్తున్నారు. ఐటీడీఏల ద్వారా గిరిజనులకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని జిల్లావాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.



సీతంపేట ఐటీడీఏలో ఇలా..

సీతంపేట ఐటీడీఏ పరిధిలో పనిచేసే ప్రాజెక్టు అధికారి ఎప్పుడు బదిలీ అవుతారో.. కొత్తగా ఏ అధికారి వస్తారో తెలియని పరిస్థితి. గత వైసీపీ సర్కారు హయాంలో ఇక్కడ విధులు నిర్వహించిన కొంత మంది పీవోలు .. వారి కింద పనిచేసే సీసీల చేతిలో కీలుబొమ్మలుగా మారారనే ఆరోపణలున్నాయి. కాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత.. సీతంపేట ఐటీడీఏ పరిస్థితి మారుతుందని ఈ ప్రాంత గిరిజనులు ఎంతో ఆశతో ఉన్నారు. అయితే ఇష్టారాజ్యంగా పీవోలను మారుస్తుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇలా అయితే గిరిజనుల సమస్యలు ఎలా పరిష్కారమవుతాయని, ఐటీడీఏ పాలన ఎప్పటికి గాడిలో పడుతుందని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అభివృద్ధి పనులు కూడా ముందుకు కదిలే అవకాశం ఉండదని వాపోతున్నారు. ఇక్కడి పీవోల బదిలీలను పరిశీలిస్తే.. 2021లో పీవోగా బాధ్యతలు చేపట్టిన నవ్య 15 నెలలు మాత్రమే ఇక్కడ పనిచేశారు. ఆ తర్వాత 2023, అక్టోబరులో పీవోగా వచ్చిన కల్పనా కుమారి 9 నెలలు మాత్రమే ఉన్నారు. ఆ తర్వాత ఈ ఏడాది ఏప్రిల్ నెలలో శుభం బన్సాల్ పీవోగా నియామకమయ్యారు. కానీ రెండు నెలలు గడవకముందే జూన్ 20న ఆయన్ని బదిలీ చేశారు. ఆ తర్వాత పార్వతీపురం ఐటీడీఏ పీవో విష్ణుచరణ్‌ను ఇన్‌చార్జిగా నియమించారు. నెల రోజుల వ్యవధిలో జాయింట్ కలెక్టర్ శోభికను ఆ బాధ్యతలు అప్పగించారు. కాగా గత నెలలలో టి.రాహుల్‌కుమార్‌రెడ్డిని పీవోగా నియమించారు.15 రోజుల వ్యవధిలోనే ఆయన్ని ఇక్కడ నుంచి పశ్చిమ గోదావరి జిల్లాకు జేసీగా బదిలీ చేశారు. ప్రస్తుతం ఎవర్నీ పీవోగా నియమించలేదు. మొత్తంగా ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు చూసుకుంటే.. సీతంపేట ఐటీడీఏ పీవోగా నలుగురు అధికారులు పనిచేశారని చెప్పొచ్చు.



జేసీగా బదిలీపై వెళ్తున్న సీతంపేట ఐటీడీఏ పీవో రాహుల్‌కుమార్‌రెడ్డి





బదిలీపై వెళ్తున్న పార్వతీపురం ఐటీడీఏ పీవో మాధవన్

పార్వతీపురం ఐటీడీఏలో పరిస్థితి ఇదీ...

జిల్లాల ఆవిర్భావానికి ముందు ఐటీడీఏ పీవోగా రోణంకి కూర్మనాథ్ ఉండేవారు. కొత్తగా పార్వతీపురం మన్యం జిల్లా ఏర్పడినప్పుడు వివిధ ప్రభుత్వ శాఖలకు కార్యాలయాలు ఏర్పాటు, తదితర విషయాలపై ఆయన ప్రత్యేకంగా శ్రద్ధ వహించి సఫలీకృతులయ్యారు. గిరిజన ప్రాంతాల్లో స్థితిగతులు, జిల్లా సమస్యలపై అవగాహన ఉండడంతో.. ఆయన్ని జిల్లా జాయింట్ కలెక్టర్‌గా నియమిస్తారని ఆ సమయంలో అంతా భావించారు. అయితే గత వైసీపీ ప్రభుత్వ కాలంలో ఓ మాజీ మంత్రి కూర్మనాథ్‌ను జేసీగా నియమించకుండా.. నెల్లూరుకు బదిలీ చేయించారనే ఆరోపణలున్నాయి. ఆ తర్వాత అప్పటి జాయింట్ కలెక్టర్ ఆనంద్ కొన్ని నెలల పాటు ఇన్‌చార్జి పీవోగా వ్యవహరించారు. అనంతరం ఐటీడీఏ పీవోగా విష్ణుచరణ్ నియామకమయ్యారు. ఆయన సుమారు 18 నెలలు పనిచేశారు. గత వైసీపీ ప్రభుత్వం ఐటీడీఏలకు ఎటువంటి నిధులు కేటాయించక పోవడంతో... జిల్లాలో ఆయన ఎటువంటి అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టలేక పోయారు. ఆ సమయంలో డిప్యూటీ డీఎంహెచ్‌వోకు ప్రత్యేక వాహనాన్ని కూడా ఏర్పాటు చేయలేని పరిస్థితి ఉండేది. ఆయన బదిలీ అనంతరం సేతు మాధవన్ ప్రాజెక్టు అధికారిగా నియామయ్యారు. ఈయన పదవీ బాధ్యతలు చేపట్టిన 12 రోజుల వ్యవధిలోనే బదిలీ చేశారు. విజయనగరం జిల్లా జాయింట్ కలెక్టర్‌గా నియమిస్తూ.. ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆదివాసీ దినోత్సవం ఘనంగా నిర్వహించిన రోజే ఆయన్ని బదిలీ చేయడం సర్వత్రా చర్చనీయాంశమైంది. దీని వెనుక కారణాలు ఏమిటన్నది ఇంకా తెలియరాలేదు. ఏదేమైనా రోజుల వ్యవధిలోనే పీవోను బదిలీ చేయడంపై అధికార వర్గాలతో పాటు గిరిజనులు, పలు సంఘాల నాయకులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.


కుంకిల రాకకు లైన్‌క్లియర్

- త్వరలో జిల్లాకు వచ్చే అవకాశం
- అటవీ ఏనుగుల కట్టడికి చర్యలు

సీతంపేట, ఆగస్టు 10: జిల్లాలో అటవీ ఏనుగులను కట్టడి చేసే కుంకిల రాకకు లైన్ క్లియర్ అయ్యింది. కొద్ది రోజుల్లోనే అవి జిల్లాకు రానున్నాయి. దీంతో జిల్లావాసులకు గజరాజుల బెడద తప్పనుంది. కర్ణాటక నుంచి నాలుగు కుంకి ఏనుగులను తీసుకురావడానికి అవసరమైన చర్యలు చేపడుతున్నారు. వాటి పర్యవేక్షణ, రోజూ అందజేయాల్సిన ఆహారం తదితర వాటిపై అటవీ శాఖాధికారులు దృష్టి సారించారు. వాస్తవంగా కుంకి ఏనుగు రోజుకు 150 నుంచి 160 కిలోల ఆహారాన్ని తీసుకుంటుంది. 16 గంటల పాటు ఆహారాన్ని తినే అలవాటు వాటికుంది. దీంతో ఏ ప్రాంతంలో ఆహారం లభ్యమవుతుంది... వాటిని సమకూర్చడానికి తీసుకోవాల్సిన చర్యలపై అటవీ శాఖ దృష్టిసారించింది. కాగా ఈ ఏనుగులకు రోజువారి వైద్య పరీక్షలు నిర్వహించాల్సిన ఉంది. వీటి కోసం అటవీశాఖ పర్యవేక్షణలో పశుసంవర్థక అధికారులను నియమించనున్నారు. అదే విధంగా ఒక కుంకి ఏనుగుకు రోజుకు 170 లీటర్ల వరకు నీటిని సమకూర్చాల్సి ఉంది.

పల్లపు ప్రాంతాలకు రప్పిస్తేనే..

జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో ఏనుగులు గిరిశిఖర ప్రాంతాల్లో సంచరిస్తున్నాయి. అక్కడకి కుంకి ఏనుగులు తరలించాలంటే సాధ్యం కాదు. ఈ నేపథ్యంలో ట్రాకర్స్ పర్యవేక్షణలో అటవీ ఏనుగులకు పల్లపు ప్రాంతాలకు రప్పించగలిగితే.. కుంకిలతో ఆపరేషన్ గజేంద్ర చేపట్టే అవకాశం ఏర్పడుతుందని అటవీశాఖాధికారులు స్పష్టం చేస్తున్నారు. ఈ విషయమై అటవీశాఖ ఫారెస్ట్ రేంజ్ అధికారి తవిటి నాయుడు మాట్లాడుతూ.. కుంకి ఏనుగుల పర్యవేక్షణ మావటీలు చూస్తారని, ఇందుకు సంబంధించి ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. కొద్దిరోజుల్లోనే అవి కర్ణాటక నుంచి జిల్లాకు నాలుగు కుంకిలు రానున్నట్లు ఆయన చెప్పారు. గతంలో మాదిరిగా అటవీ ఏనుగులు తరలించే సమయంలో మృతి చెందకుండా తగిన జాగ్రత్తలు తీసుకోనున్నాని చెప్పారు.



నాగూరు రైస్ మిల్లు ఆవరణలో సంచరిస్తున్న ఏనుగులు

నాగూరులో గజరాజులు

గరుగుబిల్లి : గరుగుబిల్లి మండలం నాగూరులో శనివారం గజరాజులు హల్‌చల్ చేశాయి. ప్రధాన రహ దారికి ఆనుకుని ఉన్న రైస్ మిల్లులపై దాడి చేశాయి. 12 క్వింటాళ్లకు పైగా బియ్యం, మిల్లు షట్టర్లు, సమీపం లోని ఉన్న పలు పంటలను ధ్వంసం చేశాయి. దీంతో రైతులు, మిల్లు యజమానులు లబోదిబోమంటున్నారు. శుక్రవారం రాత్రి తోటపల్లి ప్రధాన రహదారికి ఆనుకుని సంచరించిన ఏనుగులు నాగూరు లో బీభత్సం సృష్టించ డంతో స్థానికులు బెంబేలెత్తిపో తున్నారు. కొద్ది రోజులుగా నందివానివలస, తోటపల్లి ప్రాంతాల్లో సంచరిస్తూ.. అధికంగా పంటలను ధ్వంసం చేస్తున్న గజరాజులను తక్షణమే ఈ ప్రాంతం నుంచి తరలించాలని ఆయా గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

పేరు ఘనం

బోధన అంతంతమాత్రం

- జేఎన్‌టీయూలో సిబ్బంది కొరత
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

(విజయనగరం రూరల్)

జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక గురజాడ విశ్వవిద్యాలయం (జేఎన్‌టీయూ) బాలారిష్టాలు దాటడం లేదు. బోధన, బోధనేతర సిబ్బంది కొరత వల్ల విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. చదువులో వెనకబడతారని వారి తల్లిదండ్రులు నిరాశ చెందుతున్నారు. నేటికీ పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కూడా కల్పించలేదు. తొలుత జేఎన్‌టీయు విజయనగరం కళాశాల (కాకినాడలోని యూనివర్సిటీకి అనుబంధ కళాశాల)గా ఉండేది. దీనిని గత ప్రభుత్వం జేఎన్‌టీయూ జీవీగా మార్చింది. కానీ అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోలేదు. మౌలిక సదుపాయాల కల్పనలోనూ.. ఇటు బోధన, బోధనేతర సిబ్బంది నియామకల్లోనూ వెనుక బడింది. కళాశాల విద్యార్థుల వసతి గృహాల్లో కూడా నాణ్యమైన భోజనాలు అందివ్వడం లేదు. మరుగుదొడ్లు, తాగునీరు వంటి సదుపాయాలూ కల్పించలేని దుస్థితి. గత ప్రభుత్వ హయాంలో విద్యాశాఖమంత్రిగా బొత్స సత్యనారాయణ ఉన్నారు. యూనివర్సిటీలో జరిగిన వివిధ కార్యక్ర మాలకు హాజరై సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీలిచ్చారు. కానీ ఏనాడూ చర్యలు తీసుకున్నది లేదు. 41 మంది బోధన సిబ్బందిలో 21 మందిని, ఆరుగురు బోధనేతర సిబ్బందిని జేఎన్‌టీయూ కాకినాడ యూనివర్సిటీ నుంచి బదిలీ చేసిన వ్యవహారంపై వివాదం నడిచింది. అప్పటి ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ హేమచంద్రా రెడ్డి సహకారంతో అప్పటి జేఎన్‌టీయూ జీవీ ఉపకులపతి ప్రసాద్ రాజు ఈ బదిలీ ప్రక్రియను నడిపించా రన్న ఆరోపణలు వచ్చాయి.. దీనిపై ఉన్నత విద్యామండలి నోరు మెదపలేదు.



- జేఎన్‌టీయూ జీవీలో బీటెక్‌లో ఏడు, ఎంటెక్‌లో ఎనిమిది కోర్సులున్నాయి. ఈ విభాగాలకు సంబంధించి ఏటా 2 వేల మంది వరకూ విద్యార్థులు ప్రవేశిస్తుంటారు. సివిల్ ఇంజినీరింగ్, ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో రెగ్యులర్ బోధకులు లేరు. ఇంగ్లీషుకు కూడా రెగ్యులర్ అధ్యాపకులు లేరని సమాచారం. విజయనగరంలో కళాశాలను ప్రారంభించినప్పుడు 8 మంది ప్రొఫెసర్స్, అసోసియేట్ ప్రొఫెసర్స్-16, అసిస్టెంట్ ప్రొఫెసర్స్ 35 మంది ఉండేవారు. నాన్ టీచింగ్ స్టాఫ్‌కి సంబంధించి డిప్యూటీ రిజిస్ట్రార్-1, అసిస్టెంట్ రిజిస్ట్రార్-1, సూపరింటె ండెంట్-1, సీనియర్ అసిస్టెంట్స్-3, ఔట్‌సోర్సింగు పోస్టులు-62 మంజూరు చేశారు. వర్సిటీ స్థాయికి ఎదిగిన తరువాత ఈ పోస్టులన్నీ పెరగాల్సి వుంది. కానీ ఉన్న పోస్టుల్లోనే 40 నుంచి 50 శాతం ఖాళీగా ఉన్నాయి.



అంతర్రాష్ట్ర రోడ్డే..

ఈ ఫొటోలు చేసి.. ఇదేదో మారుమూల గ్రామంలో రహదారి అనుకుంటే పొరబడినట్టే.. పార్వతీపురం నుంచి కూనేరు వరకు ఉన్న అంతర్రాష్ట్ర రహదారి పరిస్థితి ఇది.. ఇటీవల కురిసిన వర్షాలకు మరింత అధ్వానంగా మారింది. గోతుల్లో నీరు చేరగా.. ఆ రోడ్డు చెరువును తలపిస్తోంది. దీంతో పాద చారులు, వాహన చోదకులు రాకపోకలు సాగించ లేక పోతున్నారు. ప్రధానంగా కొమరాడ, గుమడ, పార్వతీపురం డంపింగ్ యార్డు, గంగరేగువలస, చోళ్లపధం, రామభద్రపురం, కూనేరు, ఇందిరానగరం గ్రామ సమీపాల్లో అంతర్రాష్ట్ర రహదారిపై పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. దీంతో తరచూ వాహనాలు గోతుల్లో దిగబడుతుండగా.. గంటల తరబడి ట్రాఫిక్ స్తంభిస్తోంది. ఎంతో మంది ద్విచక్ర వాహనదారులు జారిపడి గాయాలపాలవుతున్నారు. శనివారం కూడా ఓ బైక్ ఈ దారిలోని గుంతలో దిగబడింది. మరోవైపు భారీ వాహనాలు, బస్సులు అతి కష్టమ్మీద రాకపోకలు సాగించాయి. ఒడిశా, ఛత్తీస్‌ఘడ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు కీలకమైన ఈ రహదారిపై నూతన ప్రభుత్వం దృష్టి సారించి.. ఇక్కట్లు తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు. తక్షణమే గోతులను పూడ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

\- కొమరాడ





ఏకమైన హృదయాలు



నాగచైతన్యతో తన నిశ్చితార్థం ఫొటోలను శోభితా దూళిపాళ్ల సోషల్ మీడియాలో అభిమానులతో పంచుకున్నారు. ఆమె చైతూతో కలసి ఊయలలో కూర్చున్న ఫొటోలు వైరల్ అయ్యాయి. 'మన పరిచయం ఎలా జరిగితేనేం, మన హృదయాలు ప్రేమలో మమేకమయ్యాయి. విడిపోలేనంతగా అవి ఏకమయ్యాయి' అంటూ ఆమెనాగచైతన్యపై తన ప్రేమను వ్యక్తం చేశారు. నిశ్చితార్థం తర్వాత శోభిత ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టిన తొలి పోస్ట్ ఇదే. దీన్ని నాగచైతన్య తన ఖాతాలో రీ పోస్ట్ చేశాడు.

థియేటర్లో విజిల్స్ పడేలా... 'బచ్చన్'



నిర్మాతగా వరుస సినిమాలను నిర్మిస్తూ.. టాప్ గేర్‌లో దూసుకుపోతున్నారు టీ.జీ.విశ్వప్రసాద్. ఆయన లేటెస్ట్‌గా హరీశ్ శంకర్ దర్శకత్వంలో రవితేజ నటించిన 'మిస్టర్ బచ్చన్' నిర్మించారు. ఈ నెల 15న సినిమా విడుదలవుతున్న సందర్భంగా ఆయన మీడియాతో ముచ్చటించారు. "ఇది కమర్షియల్ అంశాలు పుష్కలంగా ఉన్న సినిమా. మాస్ ప్రేక్షకులకు విపరీతంగా నచ్చేస్తుంది. ఈ సినిమాను హరీశ్ తన మేకింగ్ స్కిల్స్‌తో ఎక్కడికో తీసుకుపోయాడు. రవితేజ, భాగ్యశ్రీ భోర్సే మధ్యన జరిగే ప్రేమకథ అలరిస్తుంది. మిక్కీజే.మేయర్ మంచి పాటలను ఇచ్చారు. ఈ సినిమా అవుట్‌పుట్ అనుకున్నదాని కంటే చాలా బాగా వచ్చింది. థియేటర్లో వచ్చే యాక్షన్ సన్నివేశాలకు ప్రేక్షకుల నుంచి విజిల్స్ పడతాయి" అని చెప్పారు.

'అవతార్ 3' టైటిల్ వచ్చేసింది

'టైటానిక్', 'టెర్మినేటర్', చిత్రాలతో హాలీవుడ్‌లో అగ్ర దర్శకుడిగా ఎదిగారు జేమ్స్ కామెరూన్. ఆయన తెరకెక్కిస్తున్న 'అవతార్' సిరీస్‌లో మొదటి రెండు భాగాలు ప్రపంచవ్యాప్తంగా సరికొత్త రికార్డులను నెలకొల్పాయి. మొత్తం ఐదు భాగాలుగా 'అవతార్' సిరీస్ తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే.



తాజాగా, అందరినీ ఊరిస్తున్న 'అవతార్ 3' టైటిల్‌ను దర్శకుడు విడుదల చేశారు. ఈ సినిమా టైటిల్ 'ఫైర్ అండ్ యాష్'. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ "ఇందులో పండోరా గ్రహాన్ని మరింత కొత్తగా చూపెడుతున్నాను. మరిన్ని అత్యద్భుత విజువల్స్, కట్టిపడేసే భావోద్వేగాలతో మూడో భాగం ఉంటుంది. మీ అందర్నీ సంభ్రమాశ్చర్యాలకు గురిచేయడానికి ఓ కొత్త ప్రపంచాన్ని సృష్టిస్తున్నాను" అని చెప్పారు. ఈ సినిమా వచ్చే ఏడాది, డిసెంబరు 19న విడుదల అవుతుంది.















ముక్కాం గ్రామాన్ని తాకుతున్న సముద్రం

తీరం.. కోసుకుపోతోంది

- అలల తాకిడికి కోతకు గురవుతున్న వైనం
- నేలకొరుగుతున్న మత్స్యకారుల గృహాలు
- భవిష్యత్తుపై భయం



కోతకు గురైన తీరం.. కొట్టుకుపోతున్న రోడ్డు

భోగాపురం: నిన్నటి వరకు తమ జీవనాధారమైన సాగరమే నేడు కక్ష కడుతోంది. ఊళ్లపైకి దండెత్తుతోంది. తీర గ్రామాలను వణికిస్తోంది. మత్స్యకారులను కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. భోగాపురం మండలంలో సముద్ర తీరం కొన్నేళ్ల క్రితం గ్రామాలకు సుమారు 150 నుంచి 200 మీటర్ల దూరంలో ఉండేది. కొంతకాలంగా సాగర కెరటాలు పూర్తిగా తీర గ్రామాలను తాకుతున్నాయి. ముక్కాం గ్రామం ప్రస్తుతం సముద్రానికి కేవలం 15 నుంచి 20 అడుగుల దూరంలోనే ఉంది. ఏమాత్రం కెరటాల ఉధృతి పెరిగినా తీరం కోతకు గురవుతూనే ఉంది. తీరం వెంబడి ఉండే పూరిళ్లు నేల మట్టమైన సందర్భాలు ఉన్నాయి. గతంలో తుఫాన్ కారణంగా ముక్కాం సీసీ రహదారి పూర్తిగా కోతకు గురైంది. సమీపంలోని గృహాలు నేలకొరిగాయి. భోగాపురం, పూసపాటిరేగ మండలాల పరిధిలో తీరం వెంబడి అనేక గ్రామాలు ఉన్నాయి. సముద్ర నీటి మట్టం మరి కాస్త పెరిగితే అనేక గ్రామాలు కొట్టుకుపోయే పరిస్థితి ఉంది. దీంతో మత్స్యకార గ్రామాల ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. తీరం వెంబడి రక్షణ గోడ నిర్మించాలని ముక్కాం గ్రామానికి చెందిన మత్స్యకారులు అనేక పర్యాయాలు అధికారులకు, నాయకులకు మొర పెట్టుకొన్నా ఫలితం కానరావడం లేదు. ఇప్పటికైనా నాయకులు, అధికార యంత్రాంగం స్పందించాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఏవో మృతి



ఉమామహేశ్వర నాయుడు(ఫైల్)

విజయనగరం రూరల్, ఆగస్టు 10: రోడ్డు ప్రమాదంలో మండల వ్యవసాయ శాఖాధికారి మృతి చెందిన ఘటన నగరంలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎం.ఉమామహేశ్వర నాయుడు(58) విజయనగరం మండల వ్యవసాయాధికారిగా మూడేళ్లుగా విధులు నిర్వహిస్తున్నారు. స్థానిక ఆర్అండ్‌బీ రోడ్డులో కుటుంబంతో కలిసి నివసిస్తున్నారు. శుక్రవారం రాత్రి ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి ఎత్తురోడ్డు జంక్షన్ వైపు బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడడంతో స్థానికులు విశాఖపట్నంలోని కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. ఇతని స్వగ్రామం శృంగవరపుకోట కాగా ఈయన భార్య రెండేళ్ల క్రితం మరణించింది. వీరికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు.

- రైతులకు నిత్యం అందుబాటులో ఉండే వ్యవసాయాధికారిగా పేరు తెచ్చుకున్న విజయనగరం మండల అధికారి ఎం.ఉమామహేశ్వరనాయుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం పట్ల ఏపీ రైతు సంఘం ఒక ప్రకటనలో సంతాపం తెలిపింది. ఈ మేరకు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి రాంబాబు ఒక ప్రకటన విడుదల చేస్తూ, మంచి వ్యవసాయాధికారిని కోల్పోయినట్టు అయ్యిందన్నారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఏవో మృతికి ఎంపీడీవో గంటా వెంకటరావు, తహసీల్దారు ఎన్.కూర్మానాథరావుతో పాటు, మండలం లో ని అధికారులు, మండల పరిషత్ సిబ్బంది, వ్యవసాయశాఖ సిబ్బంది తదితరులు సంతాపం తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



రోషన్ (ఫైల్)

పార్వతీపురంటౌన్, ఆగస్టు 10: గుర్తు తెలియని వాహనం ఢీకున్న ఘటనలో యువకుడు మృతి చెందాడు. ఔట్ పోస్టులు, మృతుడు బంధువులు ఇచ్చిన సమాచారం మేరకు విశాఖపట్నం జిల్లా కొత్త గాజువాక, గణేష్‌నగర్‌కు చెందిన షేక్ రోషన్(26) గత కొంత కాలంగా ఇంటి సీలింగ్ పనుల్లో కూలీగా పనిచేస్తూ పట్టణంలోని బంగారమ్మ కాలనీలో నివాసముంటున్నాడు. గత అర్ధరాత్రి తన పనులు ముగించుకుని వెంకంపేట నుంచి వస్తుండగా బెలగాం శివారుల్లోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద గుర్తు తెలియని వాహనం ఢీంది. ఈ ప్రమాదంలో రోషన్ అక్కడికక్కడే మృతి చెందాడు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఔట్ పోస్టు పోలీసులు తెలిపారు.

ఇంటికొస్తున్నానని చెప్పి..

- రైల్వే ట్రాక్‌పై యువకుడి మృతి



కార్తీక్ (ఫైల్)

భామిని: మండలానికి చెందిన యువకుడు శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస రైల్వే ట్రాక్‌పై అనుమానాస్పదంగా మృతి చెందాడు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని దిమ్మిడిజోల గ్రామానికి చెందిన వలరౌతు కార్తీక్ (25) హైద్రాబాద్‌లో 3 సంవత్సరాలుగా ఉద్యోగం చేస్తున్నాడు. ఈ క్రమంలో మూడు రోజుల క్రితం ఇంటికి వస్తున్నానని, బయలుదేరానని తల్లితండ్రులైన సావిత్రి, అప్పలసూరికి ఫోన్‌లో తెలిపాడు. కానీ ఆ తర్వాత కుమారుడి వద్ద నుంచి ఎటువంటి ఫోన్ రాలేదు. ఈ క్రమంలో శుక్రవారం ఆమదాలవలస రైల్వే పోలీసులు ట్రాక్‌పై మృతదేహాన్ని గుర్తించి, కార్తీక్ తల్లితండ్రులకు సమాచారం ఇవ్వడంతో వారు హుటాహుటిన ఆమదాలవలస చేరుకుని ట్రాక్‌పై విగతజీవిగా పడి ఉన్న కుమారుడి మృతదేహం చూసి విలపించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి శ్రీకాకుళం రిమ్స్‌కు పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. శనివారం స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. అయితే మృతికి గల కారణాలు తెలియవని, హైదరాబాద్ నుంచి ట్రైయిన్‌లో దిగి ఆమదాలవలస రైల్వే ట్రాక్‌పై మృతి చెందడం అనుమానాస్పదంగా ఉందని తల్లిదండ్రులు రోదిస్తున్నారు.

భూ వివాదంలో ఏడుగురిపై కేసు

రేగిడి: మండలంలోని నాయిరాలవలస గ్రామంలో ఇద్దరు అన్నదమ్ముల మధ్య తలెత్తిన భూవివాదంలో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్న ఘటనలో శనివారం ఏడుగురిపై కేసు నమోదు చేసినట్టు ఏఎస్ఐ ఎం.రాజారావు తెలిపారు. ఈ ఘటనపై ఏఎస్ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నాయిరాలవలసకు చెందిన వావిలపల్లి శ్రీనివాసరావు, వావిలపల్లి తిరుపతిరావు అనే అన్నదమ్ముల మధ్య గత కొంతకాలంగా భూవివాదం నడుస్తోంది. ఈక్రమంలో ఈనెల 9న శ్రీనివాసరావు భార్య భారతికి మరిది తిరుపతిరావు మధ్య భూవాటాల కోసం మాటమటా పెరిగి గొడవకు దారితీసింది. ఈ ఘటనలో భారతిపై మరిది తిరుపతిరావు, తోటికోడలు రామలక్ష్మి, అత్త అన్నపూర్ణ దాడిచేసి గాయపరిచినట్టు ఆమె పోలీసులకు ఫిర్యాదుచేసింది. ఇదిలా ఉండగా.. ఇదే ఘటనలో తనపై కొడుకు శ్రీనివాసరావు, కోడలు భారతి, ఇదే వివాదంలో పెద్దలుగా వ్యవహరించిన చిట్టినాయుడు, అశిరినాయుడు దాడి చేసి, గాయపరిచారని అన్నపూర్ణ పోలీసులను ఆశ్రయించింది. ప్రస్తుతం ఫిర్యాదుదారులు ఇద్దరూ రాజాం ఆసుపత్రిలో చికిత్సపొందుతున్నారు. పరస్పరం అందిన ఫిర్యాదుల మేరకు ఏడుగురిపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం సీసాలు పట్టివేత

శృంగవరపుకోట: శృంగవరపుకోట పట్టణంలో శనివారం ఎస్ఈబీ పోలీస్‌లు 18 మద్యం సీసాలను పట్టుకున్నారు. మద్యం తరలిస్తున్న ఈశ్వరరావుతో పాటు ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశారు. ఎస్ఈబీ ఎస్.ఐ ఫణీంద్ర, హెడ్‌కానిస్టేబుల్ ప్రసాద్, పీసీ అశోక్‌కుమార్ వున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

రాజాం రూరల్: రాజాం పట్టణంలోని వస్త్రపురి కాలనీ సమీపంలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు కాగా, శనివారం రాత్రి అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ దాడి మోహన్‌రావు తెలిపారు. బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్న వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా లావేరు వెంకటాపురం గ్రామానికి చెందిన చందక లక్ష్మునాయుడు ఈనెల 4వ తేదీన తన భార్య మహాలక్ష్మితో కలిసి ద్విచక్రవాహనంపై తన స్వగ్రామం వెళ్తున్నాడు. బొబ్బిలి నుంచి రాజాం మీదుగా వెళ్తుండగా పట్టణంలోని వస్త్రపురి కాలనీ సమీపంలోకి వచ్చేసరికి ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో లక్ష్మునాయుడికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రస్తుతం ఆయన శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఎదురుగా వచ్చిన ద్విచక్రవాహనదారుడి నిర్లక్ష్యం వల్లే తన భర్తకు తీవ్ర గాయాలయ్యాయని మహాలక్ష్మి శనివారం రాత్రి రాజాం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

మోటారు చోరీ

రాజాం రూరల్: ఒమ్మి గ్రామంలో వ్యవసాయ బావికి సంబంధించిన మోటారు చోరీకి గురైంది. బాధితుడు వంగా మహేష్ శనివారం రాత్రి రాజాం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు టౌన్ సీఐ దాడి మోహనరావు తెలిపారు.

యువత సన్మార్గంలో నడవాలి

విజయనగరం క్రైం: యువత సన్మార్గంలో నడవాలని వన్‌టౌన్ సీఐ ఎస్ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం రాత్రి రైల్వే స్టేషన్ ప్రాంతంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. రికార్డులు సక్రమంగా లేని 12 వాహనాలను స్టేషన్‌కు తరలించారు. మద్యం తాగి వాహనం నడుపుతున్న ఐదుగురు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న పది మంది వ్యక్తులపై కేసు నమోదు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాత్రి సమయాల్లో యువత పట్టుబడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు తారకేశ్వరరావు, నవీన్ పడా ల్, హరిబాబు నాయుడు, నరేష్ సిబ్బంది పాల్గొన్నారు..

డీలర్లకు అవకాశంపై హర్షం

కొత్తవలస: తమ కష్టాలను అర్థం చేసుకుని.. రేషన్ సరుకులను పంపిణీకి అవకాశం కల్పిస్తున్నందుకు మండల రేషన్ డీలర్ల సంఘ అధ్యక్షుడు బి.రామలింగేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు శనివారం కొత్తవలసలో సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు దెందేరులో వైద్య శిబిరం

కొత్తవలస: కొత్తవలసకు చెందిన సుబ్బలక్ష్మీ చారిటబుల్ ట్రస్టు, విశాఖకు చెందిన మహాత్మాగాంధీ క్యాన్సర్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఆధర్యంలో దెందేరు గ్రామంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు ట్రస్టు చైర్మన్ కనకాల శివ తెలిపారు. 30 సంవత్సరాలు దాటిన మహిళలకు గర్భాశయ క్యాన్సర్‌కు సంబంధించి వైద్య పరీక్షలను నిర్వహించనున్నట్టు తెలిపారు.

సర్పంచ్‌లకు శిక్షణ

బొబ్బిలి రూరల్: మండలంలోని అన్ని పంచాయతీల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు ఈనెల 12 నుంచి 14 తేదీ వరకు 3 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్టు ఎంపీడీఓ రవికుమార్ తెలిపారు. సర్పంచ్‌లు, కార్యదర్శులు తప్పకుండా పాల్గొనాలని కోరారు.

రాజకీయ జోక్యం తగదు

బొబ్బిలి రూరల్: పాఠశాల యాజమాన్య కమిటీల ఎన్నికల్లో రాజకీయ జోక్యం తగదని లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు ఆకుల దామోధర్ అన్నారు. పాఠశాల అభివృద్ధికి సహకరించని ప్రజాప్రతినిధులకు, రాజకీయ పార్టీలకు ఎస్ఎంసీ ఎన్నికలతో సంబంధం ఏమిటని ప్రశ్నించారు. బొబ్బిలిలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తమ పార్టీల్ల అభర్థులు గెలిచారంటూ టీడీపీ, వైసీపీ నేతలు నిస్సిగ్గుగా ప్రకటనలు చేసుకోవడం సిగ్గు చేటన్నారు.

షటిల్ టోర్నమెంట్

బొబ్బిలి రూరల్: యూటీఎఫ్ స్వర్ణోత్సవాల సందర్భంగా శనివారం బొబ్బిలిలో షటిల్ టోర్నమెంట్ నిర్వహించారు. విన్నర్స్‌గా ఏటీసీ నాయుడు, జి.రవికుమార్, రన్నర్స్‌గా జి.సింహాచలం, శ్రీధర్ నిలిచారు. విజేతలను యూటీఎఫ్ రాష్ట్ర మహిళా నాయకురాలు విజయగౌరి, సభ్యులు అభినందించారు.

ఉపాధ్యాయుల సర్దుబాటు ఆపండి

బొబ్బిలి రూరల్: బొబ్బిలిలో శనివారం శ్రీనిధి పాఠశాలలో ఏపీటీఎఫ్ ప్రాంతీయ సమావేశం జిల్లా అధ్యక్షుడు యం.బలరామినాయుడు అధ్యక్షతన నిర్వహిం చారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా రాష్ట్ర అధ్యక్షుడు ఎ.సదాశివరావు పాల్గొని, మాట్లాడారు. అక్టోబరు 6, 7, 8 తేదీలలో జరగబోయే వైజ్ఞానిక మహా సభలను విజయ వంతం చేయాలని కార్యకర్తలకు కోరారు. ఇందులో భాగంగా మహాసభల పోస్టర్‌ను విడుదల చేశారు. అనం తరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.ఈశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర విద్యాశాఖామంత్రి జీవో 117 రద్దు చేస్తామని హామీ మేరకు వెంటనే రద్దు చేసి ప్రస్తుతం సర్దుబాటు ప్రక్రియ ఆపి పదోన్నతులు చేపట్టాలని, తద్వారా పాఠశాలలో ఉపాధ్యాయుల కొరతను భర్తీ చేయవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర కౌన్సిలర్ సీహెచ్ వెంకటరమణ, జిల్లా ఉపాధ్యక్షుడు గంట సత్యనారాయణ, కార్యదర్శులు కె.సత్యారావు, ఎన్.సూర్యనారాయణ, బొబ్బిలి, రామభద్రపురం, బాడంగి. తెర్లాం, దత్తిరాజేరు మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్‌కు కృతజ్ఞతలు

రామభద్రపురం: గ్రామ పంచాయతీలో నెలకొన్న వివిధ సమస్యలపై దృష్టిపెట్టిన పంచాయతీరాజ్ శాఖా మంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్‌కు సర్పంచ్‌ల ఆధ్వర్యంలో కృతజ్ఞతలు తెలుపుతున్నామని జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు మజ్జి రాంబాబు తెలిపారు. మండల కేంద్రంలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వ పాలనలో గ్రామ పంచాయతీలు పూర్తిగా నిర్వీర్యం అయ్యాయని, దీంతో సర్పంచ్‌లంతా ఉత్సవ విగ్రహాలుగా మిగిలిపోయారన్నారు. ఇటువంటి తరుణంలో రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం స్పందించడం ఎంతో హర్షణీయమని అన్నారు. స్వాతంత్రోత్సవ వేడుకలకు గతంలో పంచాయతీలకు వంద రూపాయలు చెల్లించేవారని, ఇప్పుడు దానిని రూ.10వేలకు పెంచడం హర్షణీయమన్నారు. పంచాయతీలకు వివిధ గ్రాంటులలో రావాల్సిన నిధుల విషయంలో కూడా ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. ఇటీవల పంచాయతీరాజ్ వ్యవస్థాపక అధ్యక్షుడు వైవీబీ.రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో సర్పంచ్‌ల సమస్యలపై మంత్రి పవన్‌కల్యాణ్‌కు వినతిపత్రం ఇచ్చామని, దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. పంచాయతీ పాలనలో సర్పంచ్‌లకు అధిక ప్రాధాన్యత ఇస్తామని తెలిపారని అన్నారు. మండలంలో ఈ నెల 12వ తేదీ నుంచి 14వ తేదీ వరకు పంచాయతీ పాలనపై సర్పంచ్‌లకు శిక్షణా కార్యక్రమాలు అమలు చేయనున్నారని, సర్పంచ్‌లంతా హాజరై శిక్షణా కార్యక్రమా న్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో దుప్పలపూడి సర్పంచ్ వైకుంఠం విజయభాస్కర్ పాల్గొన్నారు.

భైరిసాగరం సంగతి అంతేనా?



భైరి సాగరం చెరువు

బొబ్బిలి: పాత బొబ్బిలికి చెందిన భైరిసాగరం చెరువు సుందరీకరణ పనుల కోసం రూ.1.10 కోట్లతో చేపట్టిన పనులు ఎక్కడివక్కడ నిలిచిపోయాయి. గత వైసీపీ హయాంలో బుడా నుంచి నిధులను మంజూరు చేయించారు. ప్రస్తుతం తెలుగుదేశం ప్రభుత్వం బుడా నిధుల వినియోగానికి సంబంధించి ఆచితూచి అడుగు వేస్తున్నందున ఈ పనులు తిరిగి ఎప్పుడు ప్రారంభమవుతాయన్నది ప్రశ్నార్థకంగా మారింది. గత ఏడాది అప్పటి ఎమ్మెల్యే శంబంగి ఈ పనులకు శంకుస్థాపన చేశారు. 700 ఎకరాల విస్తీర్ణం కలిగి ఉన్న చెరువు ఆ క్రమణలకు గురైనట్లు గుర్తించామని ప్రకటించారు. కానీ ఆ ఆక్రమణలను తొలగించేందుకు తీసుకున్న చర్యలు మాత్రం శూన్యం. భైరిసాగరాన్ని ఆధునీకరిస్తే పర్యాటక ప్రాంతంగా మారడం ఖాయం. ఆ చెరువు ఒడ్డున బొబ్బిలి యుద్ధ స్మారక స్తంభం ఉన్నందున దానిని చూసేందుకు పర్యాటకులు వచ్చేందుకు అవకాశం ఉంది.



గత ప్రభుత్వ హయాంలో శంకుస్థాపన చేస్తున్న చేస్తున్న అప్పటి ఎమ్మెల్యే శంబంగి (ఫైల్)

కాంట్రాక్టరుతో చర్చిస్తున్నాం

భైరిసాగరం చెరువు సుందరీకరణ పనులకు సంబంధించిన కాంట్రాక్టరుతో చర్చిస్తున్నాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ పనులను పూర్తి చేయించేందుకు తగిన చర్యలు తీసుకుంటాం. ఎమ్మెల్యే అభిప్రాయాలను తీసుకొని నివేదిస్తాం.

-లాలం రామలక్ష్మి, మున్సిపల్ కమిషనర్, బొబ్బిలి

రోడ్ల మరమ్మతులకు శ్రీకారం



బొబ్బిలి పట్టణంలో పాడైన రోడ్లను బాగు చేయిస్తున్న దృశ్యం

బొబ్బిలి: బొబ్బిలి పట్టణంలోని వివిధ ప్రాంతాలలో మృత్యు మార్గాలుగా మా రుతున్న రహదారుల మరమ్మతులకు అధికారులు శ్రీకారం చుట్టారు. శుక్రవారం ఈ రోడ్డులో యంత్రాలతో పెద్దగుంతలన్నిటినీ పూడ్చేందుకు చర్యలు చేపట్టారు. నాయకులు, అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతు పనులు చేపడుతున్నందుకు స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉచిత వైద్య శిబిరం

బొబ్బిలి రూరల్: బొబ్బిలి రోటరీ క్లబ్, ఎన్ఆర్ఐ హాస్పిటల్ సంయుక్త నిర్వహణలో రోటరీ క్లబ్ అధ్యక్షులు సంద్రీ శ్రీనివాసన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఎన్ఆర్ఐ హాస్పిటల్ ప్రాంగణంలో నిర్వహించారు. ఈ వైద్యశిబిరానికి గుండె, మూత్రపిండాలు, కీళ్ల నొప్పులు, టీబీ, జ్వరాలు, ఆస్తమా డయాబెటిస్, గ్యాస్ట్రిక్ సమస్యలతో బాధపడుతున్న రోగులను డాక్టర్ అభినయ్ పరీక్షించి ఉచితంగా మందులు అందించారు. అవసరమైన రోగులకు బీపీ, చక్కెర స్థాయి పరీక్షలతో పాటు రక్త పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రోటరీ జిల్లా చైర్మన్ జేసీ రాజు మాట్లాడుతూ రోటరీ సంస్థ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తుందని, వైద్య శిబిరాల ద్వారా సామాన్య ప్రజలకు, పేదలకు వైద్య సేవలు అందిస్తామన్నారు.

పర్యావరణ రక్షణ ధ్యేయం

వేపాడ: మండలంలోని జగ్గయ్యపేట గ్రామంలో హరిత ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ(హర్ష్) స్వచ్ఛంద సంస్థ వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విశ్రాంత వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్(శ్రీకాకుళం) రమణమూర్తి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హర్ష్ సంస్థ పర్యావరణ రక్షణకు రెండు జిల్లాల్లో పని చేయడం అభినందనీయమన్నారు. అనంతరం మొక్కలు నాటారు.

గుంటూరు సదస్సులో రాపర్తి



మాట్లాడుతున్న జగదీష్ బాబు

కొత్తవలస, ఆగస్టు 10 : వికలాంగులతో జీవించే పిల్లల హక్కుల పరిరక్షణపై గుంటూరులో నిర్వహించిన కార్యక్రమంలో గురుదేవ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు పాల్గొన్నారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్ సింగ్ ఠాకూర్ ముఖ్య అతిథిగా హాజరైన ఈ కార్యక్రమంలో దివ్యాంగులకు సంబంధించిన అంశాలపై జగదీష్‌బాబు ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు నరేంద్ర, వి.సుజాత, వి.ఆర్.కె. కృపాసాగర్, జ్యోతిర్మయి ప్రతాప, గుంటూరు కలెక్టర్ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

ఆధిక్యంలో తూర్పు గోదావరి జట్టు



విజ్జీ స్టేడియంలో విజయనగరం, తూర్పుగోదావరి జట్ల మధ్య మ్యాచ్ సాగుతున్న దృశ్యం

విజయనగరం టౌన్: జిల్లా కేంద్రంలోని ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా క్రికెట్ మ్యాచ్‌లు హోరాహోరీగా సాగుతున్నాయి. తొలి ఇన్నింగ్స్‌లో విజయనగరం జట్టుపై తూర్పు గోదావరి, శ్రీకాకుళం జట్టు పై విశాఖ జట్టు ఆధిక్యం సాధించాయి. సర్ విజ్జీ మైదానంలో విజయనగరం-తూర్పుగోదావరి జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్‌లో తూర్పుగోదావరి జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 250 పరుగులకు, విజయనగరం జట్టు 199 పరుగులకు ఆలౌటయ్యాయి. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన తూర్పు గోదావరి జట్టు ధాటిగానే బ్యాటింగ్ చేసింది. సాయంత్రం 4.30 గంటల సమయానికి మూడు వికెట్లు కోల్పోయి 124 పరుగులు సాధించింది.

విశాఖకు 221 పరుగుల ఆధిక్యం

చింతలవలసలోని డాక్టర్ పీవీజీ రాజు నార్త్‌జోన్ క్రికెట్ అకాడమీ మైదానంలో విశాఖపట్టణం- శ్రీకాకుళం జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్‌లో విశాఖ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 330 పరుగులకు ఆలౌట్ కాగా.. శ్రీకాకుళం జట్టు 209 పరుగులకు ఆలౌటైంది. విశాఖ జట్టుకు 221 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన విశాఖ జట్టు ఆట ముగిసే సమయానికి 23 ఓవర్లలో నాలుగు వికెట్లు నష్టపోయి 83 పరుగులు సాధించింది.

గురజాడ గృహాన్ని పరిరక్షించండి




మంత్రి కొండపల్లికి వినతిపత్రం అందిస్తున్న భీశెట్టి


విజయనగరం దాసన్నపేట: మహాకవి గురజాడ అప్పారావు గృహం మురికికూపంగా మారిపోయిందని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బి.బాబ్జీ అన్నారు. శనివారం రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురజాడ అప్పారావు గృహం చుట్టుపక్కల ముళ్ల చెట్లతో మురికికూపంగా తయారైందన్నారు. ఏటా గురజాడ జయంతి, వర్ధంతి కార్యక్రమాలను నిర్వహించడం, తరువాత వదిలేయడం అనవాయితీగా వస్తోందన్నారు. మంత్రిని కలిసిన వారిలో సంఘ నాయకులు నాగభూషణం, రాజారావు, పీఎల్ఎన్ రాజు, రామ్మోహనరావు, రామచంద్రరావు, ప్రభాకరరావు తదితరులు ఉన్నారు.

అద్దె భవనాల్లోనే..

- అంగన్‌వాడీ కేంద్రాలకు లేని సొంత నిర్మాణాలు
- మండలంలో సగానికి పైగా ఇదే దుస్థితి



జీలికవలసలో పూరిపాకలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రం



ఎస్.సీతారాంపురంలో పంచాయతీ భవనంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రం

రామభద్రపురం: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. మొత్తం 64 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా వీటిలో 37 కేంద్రాలు అద్దెకొంపల్లోనూ, పరాయి భవనాల్లోనూ నడుస్తున్నాయి. చిన్న పిల్లలకు, గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం అందించే అంగన్‌వాడీలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి పెట్టకపోవడంతో కేంద్రాల్లో ఉన్న నిర్వాహకులు, పిల్లల ఇక్కట్లు వర్ణణాతీతం. సు మారు 2,223 మంది పిల్లలకు ఈ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందుతోంది. 179 మంది గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్నారు. చాలా గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలపై ప్రభుత్వ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. చాలా గ్రామాల్లో మంజూరైన భవనాలు నిర్మించకపోవడం, నిర్మించినా ప్రభుత్వానికి అందించకపోవడం వంటి చర్యలు కోకొల్లలు. సోంపురం గ్రామంలో అంగన్‌వాడీ భవనం నిర్మాణం పూర్తయినప్పటికీ కాంట్రాక్టర్‌కు బిల్లు చెల్లించకపోవడంతో ఆ భవనాన్ని అధికారులకు అప్పగించలేదు. అలాగే శిష్టుసీతారాంపురం గ్రామంలో అంగన్‌వాడీ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో పంచాయతీ కార్యాలయంలో పిల్లలకు ఆహారం అందిస్తున్నారు. ఇట్లామామిడిపల్లి గ్రామంలో 2 అంగన్‌వాడీ కేంద్రాలు అద్ద భవనంలోనే ఉంటున్నాయి. జీలికవలస గిరిజన గ్రామంలో ఉన్న మినీఅంగన్‌వాడీ కేంద్రం పూరిపాకలోనే మగ్గుతోంది. ఈ హైటెక్ పాలనలో కూడా ఈ విధంగా అంగన్‌వాడీ కేంద్రాలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి.

గ్రానైట్ లీజు అనుమతి రద్దుచేయాలి

● సీపీఎం రాష్ట్ర నాయకుడు కృష్ణమూర్తి డిమాండ్


మాట్లాడుతున్న కృష్ణమూర్తి

పార్వతీపురం టౌన్: బడిదేవర కొండ గ్రానైట్ మైనింగ్ లీజుఅనుమతి రద్దు చేయాలని సీపీఎం రాష్ట్ర సీనియర్‌నాయకుడు ఎం.కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. శనివారం పార్వతీపురంలోని సుందరయ్య భవనంలో విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని వెలగవలస గ్రామసమీపంలో 2016లో బడిదేవరకొండ గ్రానైట్‌ను తవ్వుకొనేందుకు ఎంఎస్‌పీ కంపెనీ ప్రభుత్వ అనుమతులు పొందిందని చెప్పారు.అప్పట్లో గ్రానైట్ తవ్వే కొండ రిజర్వ్‌ఫారెస్ట్‌లో ఉందని అటవీశాఖ అధికారులు అభ్యంతరం తెలిపారన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రెవెన్యూ, అటవీశాఖాధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించి బడిదేవర కొండ రిజర్వ్ ఫారెస్టులో ఉందని నిర్ధారించారన్నారు.ప్రజాసంఘాలు, వామపక్షాలు, ప్రజల పోరాటం వల్ల 2017లో గ్రానైట్ లీజు లైసెన్స్ రద్దు చేశారని చెప్పారు. లైసెన్స్ పునరుద్ధరిం చాలని ఎంఎస్‌పీ గ్రానైట్ కంపెనీ హైకోర్టును ఆశ్రయించిందని తెలిపారు. హైకోర్టు గత ఏడాది మార్చి 14న అటవీశాఖ అభ్యంతరాలను పరిగణలోకి తీసుకున్న తర్వాత లైసెన్స్ పునరుద్ధరిం చాలని కోరిందనిచెప్పారు. అమ్మవారు నిలయమై ఉన్న కొండగా భావిస్తున్న ప్రజల మనోభావాలను దెబ్బతీసేవిధంగా అనుమతిఇవ్వడం బాధకరమన్నారు. యంత్రాంగం స్పందించకపోతే పోరాటాలను చేపడతామన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఆర్.వేణు, మండల కార్యదర్శి బంటుదాసు పాల్గొన్నారు.

పర్యావరణహిత వ్యవసాయమే లక్ష్యం: ఏవో


సతాభిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో తిరుపతిరావు

పాచిపెంట: పర్యావరణ హిత వ్యవసాయమే పొలంబడి లక్ష్యమని ఏవో కె.తిరుపతిరావు తెలిపారు.శనివారం మండలంలోని సతాభి, రాయివలస, పెదకంచూరులో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 14 వారాల పాటు జరిగే పొలంబడిలో పర్యావరణానికి హాని జరగకుండా అధిక దిగుబడులు సాధించే దిశగా రైతులను తయారు చేయడమే లక్ష్యమన్నారు. రైతులు మొక్కజొన్న పంటను వదిలి అధిక ఆదాయం ఇచ్చే చిరుధాన్యాల సాగు, ఒలిసలు వంటి పంటలు సాగుచేసుకోవాలని తెలిపారు. బహుళ పంటలను పండించడం వల్ల మిత్రపెరుగుల సంఖ్యను పెంచవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు కిరణ్, దినేష్, రాజు, సంజీవ్ పాల్గొన్నారు.

నేడు ఒట్టిగెడ్డ నుంచి నీరు విడుదల

జియ్యమ్మవలస: మండలంలోని ఒట్టిగెడ్డ రిజర్వాయర్ నుంచి ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ఆదివారం ఉదయం 11 గంటలకు నీటిని విడుదల చేయనున్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 382 అడుగులు నీరు ఉన్నట్లు నీటి పారుదలశాఖ అధికారులు తెలిపారు. కాగా టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమం జయప్రదం చేయాలని టీడీపీ మండల కన్వీనర్ పల్ల రాంబాబు కోరారు.

పశుగణనపై శిక్షణ


మాట్లాడుతున్న మన్మథరావు

పాలకొండ: పాలకొండలో మన్యం జిల్లా 21వ అఖిల భారత పశుగణనపై శిక్షణ తరగతులు జిల్లా పశుసంవర్ధక అధికారి డాక్టర్ శివ్వాల మన్మథరావు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఎంపిక చేసిన కుటుంబాలకు సంబంధించి పశుసంవర్ధకశాఖఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లను ప్రతిఇంటిని సందర్శించి పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్ల వివరాలు నమోదు చేయాలన్నారు. నమోదు ప్రక్రియ మొబైల్‌యాప్ ద్వారా చేయాలన్నారు.కార్యక్రమంలో అధికారులు మాణిక్యరావు, శ్రీనివాస్, రమేష్, చైతన్యశంకర్, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

రేకులషెడ్డులో బోధన

●వర్షం కురిస్తే విద్యార్థుల అవస్థలు ●ఇదీ రామానగరంలో పరిస్థితి


ఈ రేకులషెడ్డులోనే రామానగరం యూపీ పాఠశాల నిర్వహిస్తున్నారు

సీతంపేట రూరల్ : మండలంలోని దారపాడు పంచాయతీ పరిధిలోని రామానగరం ప్రాథమిక పాఠశాలలో రేకులషెడ్‌లో నిర్వహిస్తున్నారు. ఇక్కడ ఒకటి నుంచి ఐదో తరగతి వరకూ 32 మంది చదువుతున్నారు. ఇక్కడ ఇద్దరు ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. పాఠశాలకు పక్కా భవనం లేకపోవడంతో రేకుల షెడ్డులో బోధన సాగుతోంది. భవనం శిథిలావస్థకు చేరినా అధికారులు కొత్త భవనం నిర్మాణానికి చర్యలు తీసుకోలేదని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. వర్షం కురిస్తే ఈ షెడ్‌కారిపోతుండడంతో విద్యార్థులు అవస్థలకు గురవుతున్నారు. ఈ తరహా రేకు షెడ్లల్లో సీతంపేట ఏజెన్సీ ప్రాంతంలో 16 వరకు పాఠశాలలు నిర్వహిస్తున్నారు. కాగా రామానగరంలోని పాఠశాలకు పక్కా భవనం నిర్మాణంకోసం గత ప్రభుత్వ హయాంలో నాడు-నేడు పథకంలో ఫేజ్-1,2,3లో ప్రతిపాదనలు పంపించినా మంజూరు కాలేదని ఎంఈవో ఆనందరావు తెలిపారు.

గిజబ నిర్వాసిత కాలనీలో సమస్యల తిష్ఠ


కాలనీలో కల్వర్టుపై పాడైన పలక

గరుగుబిల్లి: తోటపల్లి ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా ఏర్పాటుచేసినగిజబ నిర్వాసిత కాలనీలో సమస్యలు తిష్ఠ వేశాయి. ప్రధానంగా కాలనీ ఏర్పాటుచేసిన సమయంలో సిమెంటు రహదారులతోపాటు ఆయా వీధులకు వెళ్లేందుకు వీలుగా కాలువలపై కల్వర్టులు నిర్మించారు. కల్వర్టులపై వేసిన పలకలు పాడవడంతో ఏ మాత్రం వర్షం కురిసినా ఎక్కడికక్కడే నీరు నిల్వఉంటోందని పలువురు తెలిపారు.జలజీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పూర్తిస్థాయిలో ఇంటింటికి కుళాయిలను ఏర్పాటు చేయకపోవడంతో తాగునీటి కోసం ఇబ్బందులకు గురవుతున్నారు. కాలనీలో సమస్యలు పరిష్కరించాలని ఇప్పటికే సంబంధిత అధికారులకు తెలియజేసినా నిధులు మంజూరు నిమిత్తం చర్యలు చేపట్టడం లేదని సర్పంచ్ మండల భాగ్యలక్ష్మి, ఎంపీటీసీ మాజీ సభ్యులు మండల శంకరరావు తెలిపారు.

ప్రమాదకరంగా పెద్దూరు కల్వర్టు

● భయాందోళన చెందుతున్న వాహనచోదకులు


శిథిలావస్థకు చేరిన పెద్దూరు కల్వర్టు

గరుగుబిల్లి: గరుగుబిల్లికి సమీపంలోని పెద్దూరు వెళ్లే ప్రధాన కల్వర్టు ప్రమాదభరితంగా తయారైంది. గతంలో నిర్మించిన కల్వర్టు భారీ వాహనాలు రాకపోకల వల్ల కుంగిపోయింది. గరుగుబిల్లి నుంచి బీపీపురం గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి మార్గం అధ్వానంగా మారింది. రహదారితో పాటు కల్వర్టు శిథిలావస్థకు చేరడంతో వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు. గరుగుబిల్లి నుంచి ఐదు కిలో మీటర్ల పరిధి లోని రహదారి అడుగడుగునా గోతులమయంగా తయారైంది. ప్రధాన కల్వర్టుకు ప్రమాదం వాటిల్లితే పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయే అవకాశముందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. పెద్దూరుతో పాటు బీపీపురం ప్రాంతంలో ఈ పరిస్థితి నెలకొంది. సంబంధిత అధికారులు దృష్టి సారించి అవసరమైన మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

డోలీల మోతలు ఉండకూడదు

● గర్భిణులు వసతిగృహంలో ఉండాలి ● వంద పడకల ఆసుపత్రి నిర్మాణం పూర్తిచేస్తాం : మంత్రి సంధ్యారాణి


మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

సాలూరు: ఎట్టి పరిస్థితిల్లోనూ డోలీలు మోతలు ఉండకూడదని గిరిజనశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. వైద్య సిబ్బంది మానవతా దృక్పథంతో పనిచేయాలని కోరారు.శనివారం పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలోప్రత్యేక నిధులుతో నిర్మించిన వెయిటింగ్ హాలు ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ రోగులతో పాటు వారి బంధువులు, వారి పిల్లలకు పాలిచ్చేందుకు, తల్లులు ఉండేందుకు వెయిటింగ్ హాల్ లేకపోవడంతో చెట్లకింద, ఆరుబయటఉండి ఇబ్బందులుపడడంతో కలెక్టర్‌ను సంప్రదించి ప్రత్యేక నిధులతో వెయిటింగ్ హాల్‌ను నిర్మించినట్లు తెలిపారు.టీడీపీఅధికారంలోఉన్న సమయంలో వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి భూమి పూజచేశామని, మళ్లీ కూటమి ప్రభుత్వంలోనే ప్రారంభిస్తామని తెలిపారు. ఏడునెలలు నిండిన గిరిజన గర్భిణులను ఆశా, ఆరోగ్యసిబ్బందితీసుకొచ్చి వసతిగృహంలో ఉంచాలని తెలిపారు.ఆసుపత్రి పేదలకు అందుబాటులో ఉండాలని, డాక్టర్లు సక్రమంగా పనిచేయాలన్నారు. సిబ్బంది, వైద్యులకు సమస్యలపై గతంలో వలే రోడ్లు ఎక్కకుండా పరిష్కరించుకొనే దిశగా పనిచేద్దామన్నారు.అనంతరం మంత్రి సంధ్యారాణిని ఘనంగా సత్కరించారు. ఆసుపత్రిలో శిక్షణ పొంది, ఉత్తీర్ణత సాధించిన ఏఎన్ఎం,ల్యాబ్ టెక్నీషియన్లకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆసుపత్రిసూపరింటెండెంట్ సూర్యకుమారి, ఆర్ఎంవోవిశ్వానాథ్, టీడీపీపట్టణాధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు, కౌన్సిలర్లు హర్షలక్ష్మీజీ, ప్రిన్సిపాల్ జగదీశ్వరరావు పాల్గొన్నారు.

ఉద్యమాలతోనే సమస్యల పరిష్కారం

● యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి వెంకటనాయుడు


గరుగుబిల్లి: యూటీఎఫ్ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

గరుగుబిల్లి: ఉద్యమాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పి.వెంకటనాయుడు తెలిపారు. శనివారం మండలంలోని ఎర్రన్నగుడి సముదాయంలో యూటీఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటనాయుడు మాట్లాడుతూ యూటీఎఫ్ ఆవిర్భవించి 50 ఏళ్లు పూర్తికావడంతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. విద్యారంగం పరిరక్షణ కోసం కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కె.గోవిందమ్మ, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎరుకునాయుడు, టి.శ్రీనివాసరావు, పి.శ్రీనివాసరావు, జె.సురేష్, రాము, గోపి, వెంకటనాయుడు పాల్గొన్నారు.

యూటీఎఫ్ స్వర్ణోత్సవాల జెండా ఆవిష్కరణ

పార్వతీపురం ఆంధ్రజ్యోతి: ఉపాధ్యాయులు హక్కుల రక్షణకు, విద్యారంగాన్ని రక్షించడానికి తమ సంఘం నిరంతరం శ్రమిస్తోందని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మురళీమోహన్‌వు తెలిపారు. శనివారం పార్వతీపురం ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో యూటీఎఫ్ ఆవిర్భవించి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా స్వర్ణోత్సవాల జెండాను జిల్లా అధ్యక్షుడు టి.రమేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మురళీమోహన్‌రావు మాట్లాడుతూ స్వర్ణోత్సవాలు పురస్కరించుకుని ఆటలు, సాంస్కృతికపోటీలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు వి.జ్యోతి, కె.మురళి, ఎన్. శ్రీను, బి.జగన్నాథం, వసంతనాయుడు పాల్గొన్నారు.

డిజిటల్ పేమెంట్స్‌తో ప్రయాణం సుఖవంతం

● నేటి నుంచి ఫాస్ట్‌పాసింజర్ పునరుద్ధరణ

● ఈస్ట్‌కోస్టు రైల్వే చీఫ్ కమర్షియల్ అధికారి వినేష్

పార్వతీపురంటౌన్: డిజిటల్ పేమెంట్స్ వల్ల ప్రయాణికుల ప్రయాణం సుఖవంతంగా జరుగుతుందని ఈస్ట్‌కోస్టు రైల్వేచీఫ్‌కమర్షియల్ అధికారి వినేష్ తెలిపారు. ఆదివారం నుంచి విజయవాడ ఫాస్ట్ పాసింజర్ రాకపోకలు పునరుద్ధరించినట్లు చెప్పారు. శనివారం పార్వతీపురం రైల్వేస్టేషన్‌లోని ప్రయాణికులకు టిక్కెట్లు ఇచ్చే ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రైల్వేశాఖలో పలు కీలక మార్పులు చేపట్టినట్లు తెలిపారు. ప్రయాణికులు ఇక నుంచి డిజిటల్ పేమెంట్స్‌ను సద్వినియోగం చేసుకోవాలనికోరారు. ఇందులో భాగంగానే ప్రయాణికులు టిక్కెట్లు తీసుకొనే క్రమంలో నగదురహిత, ఫోన్‌పే, గూగుల్‌పే డిజిటల్ పేమెంట్స్ ప్రక్రియను అమలులోకి తీసుకువచ్చినట్లు చెప్పారు. ప్రయాణికులే మా దేవుళ్లు అన్న నినాదంతో రైల్వేశాఖ పలు వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందని తెలిపారు.

వరహాలగెడ్డలో గుర్రపుడెక్క తొలగింపు

● పార్వతీపురం మునిసిపల్ కమిషనర్ శ్రీనివాసరావు

పార్వతీపురంటౌన్: బిస్‌బిరావు కాలనీ నుంచి బైపాస్ కాలనీ మీదుగా ఏడుఖానాల వరకు వరహాలగెడ్డలోని వ్యర్థాలు, గుర్రపు డెక్కను ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ఆదేశాల మేరకు తొలగించామని పార్వతీపురం మునిసిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. 30 వార్డుల్లో పూడిక తీత పనులు చేపట్టినట్లు చెప్పారు. శనివారం పలు వార్డుల్లో గల వీధులతో పాటు ప్రధాన రహదారిలో జరుగుతున్న కాలువల్లో పూడికతీతను పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న నేప ధ్యంలో ఆయా వీధులతోపాటు ప్రధాన రహదారిపైకి మురుగు, వరదనీరు రాకుండా పూడికలు తీస్తున్నామని చెప్పారు. మురికివాడల్లో పరిసరాల పరిశుభ్రతపై సచివాలయ అధికారులు, మహిళా సంఘాల సాయంతో ప్రచారం చేపడతామని తెలిపారు.

పీవో బదిలీ నిలుపుదల చేయాలి

● గిరిజన ప్రజా సమాఖ్య ఉత్తరాంధ్ర అధ్యక్షుడు మోహన్‌పాల్


ఐటీడీఏ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న నాయకులు

సీతంపేట:సీతంపేట ఐటీడీఏ పీవో రాహుల్‌కుమార్‌రెడ్డి బదిలీ నిలిపివేయాలని గిరిజన ప్రజాసమాఖ్య ఉత్తరాంధ్ర అధ్యక్షుడు మోహన్‌పాల్, గిరిజన ప్రజా సమాఖ్య సెక్రటరీ చిరంజీవి డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఐటీడీఏ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్థాంతరంగా బదిలీ చేయడం వల్ల ఆదివాసీలకు వ్యతిరేక సమాచారం చేరే అవకాశం ఉంటుందన్నారు. ఆయన పీవోగా బాధ్యతలు చేపట్టి 15 రోజుల్లో గిరిజన గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి సమస్యలు తెలుసుకున్నారన్నారు. తాగునీరు, గర్భిణులకు వసతిగృహం, సీతంపేట ఏరియా ఆసుపత్రికి ట్రాన్స్‌ఫార్మర్, గిరిజన గ్రామాల్లో మలేరియా నివారణకు మెడికల్ క్యాంప్‌లు, వన్‌ధన్ వికాస్ కేంద్రాల అమలుకు ప్రత్యేక చర్యలు తీసుకోవడంలో కలక పా త్ర పోషిస్తున్న తరుణంలో బదిలీ ఆదివాసీలకు కలచివేసిందని, వెంటనే ప్రభుత్వం నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్య క్రమంలో మండల అధ్యక్షుడు సవర బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

పీవో బదిలీ సరికాదు

ఐటీడీఏ పీవో రాహుల్‌కుమార్‌రెడ్డిని కొనసాగించాలని గిరిజన ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిడ్డిక తేజేశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పీవోగా బాధ్యతలు చేపట్టి గిరిజన సమస్యలు పట్ల చిత్తశుద్ధితో పనిచేస్తున్న ఆయన బదిలీ సరికాదన్నారు.

కొమరాడ ఏజెన్సీలో భారీ వర్షం

కొమరాడ: కొమరాడ ఏజెన్సీలో శనివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ప్రధానంగా ఖరీఫ్ సాగు చేస్తున్న పత్తి, వరి పంటలకు ఉపయోగంగా ఉంటుందని రైతులు చెబుతున్నారు. రైతులు వరి నాట్లు వేసేందుకు సిద్ధమవుతున్న తరుణంలో భారీ వర్షాలు కురవడంతో చెరువుల్లో నీరు చేరింది. దీంతో రైతులు దమ్ములు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు.

విద్యా ప్రమాణాల మెరుగుకు కృషి

గుమ్మలక్ష్మీపురం: పాఠశాలలో వసతుల కల్పనకు, విద్యా ప్రమాణాల మెరుగుకు కృషి చేస్తానని గుమ్మలక్ష్మీపురం హైస్కూల్ కమిటీ చైర్మన్ శొంఠ్యాన రాజేష్ తెలిపారు. శనివారం గుమ్మలక్ష్మీపురంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి సహకారంతో పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని చెప్పారు. పాఠశాలలో విద్యార్థుల ఎనరోల్‌మెంట్ పెరగడానికి కూడా ప్రయత్నిస్తానని తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి


భామిని: మాట్లాడుతున్న కృష్ణారావు

భామిని: గ్రామాల్లో సమస్యలను గుర్తించి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని ఈవోపీఆర్డీ జి.కృష్ణారావు కోరారు. భామినిలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు మూడు రోజులుగా శిక్షణ కొనసాగుతోంది.శనివారం జరిగిన కార్య క్రమంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి శిక్షణను వినియోగించుకోవాలని సూచించారు. కార్య క్రమంలో రమణయ్య పాల్గొన్నారు.

నిధుల వినియోగంపై అవగాహన

వీరఘట్టం: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న జీపీడీపీ శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి.ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులు వినియోగంపై అవగాహన కల్పించారు. అనంతరం వీరఘట్టంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్దకు తీసుకొని వెళ్లి కంపోస్టు ఎరువు తయారీ విధానాన్ని వివరించారు. కార్య క్రమంలో ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, కార్యదర్శులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

జ్వరంతో అంగన్‌వాడీ హెల్పర్ మృతి

భామిని:మండలంలోని గురండి అంగన్‌వాడీ హెల్పర్ దువ్వాడసుమతి (37) జ్వరంతో శనివారం మృతి చెందింది. కుటుంబ సభ్యులు, అంగన్‌వాడీ సిబ్బంది కథనం మేరకు.. మూడు రోజులుగా సుమతి జ్వరంతో బాధపడుతూ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. అయినా జ్వరం తగ్గడంలేదు. ఈ నేపథ్యంలో తన తల్లి ఇక్కడ సౌకర్యం లేదని కొరమ గ్రామానికి తీసుకెళ్లి కొత్తూరు ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యులను సంప్రదించింది. మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం తీసుకెళ్లాలని సూచించారు.దీంతో శనివారం ఉదయం ఆటోలో శ్రీకాకుళం తరలిస్తుండగా హిరమండలం సమీపంలో మృతి చెందింది. ఆమెను గురండి తెచ్చి అంత్యక్రియలను నిర్వహించారు. మృతురాలికి భర్త నూకయ్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. అయితే సరైన వైద్యం అందకపోవడంతోనే సుమతి మృతిచెందిందని పలువురు వాపోతున్నారు.

నిబంధనలు పాటించాలి

మక్కువ: వాహనచోదకులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని ఎస్ఐ పి.నరసింహమూర్తి తెలిపారు. శనివారం స్థానిక సువర్ణముఖి నది వంతెన సమీపంలో వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వాహన పత్రాలు తప్పనిసరిగా కలిగి ఉండాని,పెండింగ్ చలానాలు తక్షణమే చెల్లించాలని తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


గుమ్మలక్ష్మీపురం: నృత్యాలు చేస్తున్న గిరిజన విద్యార్థినులు


భామిని: నృత్యాలు చేస్తున్న బాలికలు

ఆదివాసీ హక్కులను కాపాడుకోవాలి

భామిని: ఆదివాసీల హక్కులను కాపాడుకోవాలని వరల్డ్ సంస్థ డైరెక్టర్ సుమిత కోరారు. శనివారం భామినిలో హోలీ క్రాస్ సంస్థ డైరెక్టర్ కె. ప్రభుదాస్ ఆధ్వర్యంలో ఆదివాసీదినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఉచితంగా టైలర్‌శిక్షణ పొందుతున్న మహిళలకు స్వయం ఉపాధి కల్పించడమే లక్ష్యమన్నారు. అనంతరం బాలికలు ఆదివాసీ సంస్కృతి నృత్యాలు చేశారు.

●గుమ్మలక్ష్మీపురం: మండలంలోని భద్రగిరి పీటీజీ బాలికల గురుకుల పాఠశాలలో శనివారం ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సత్యవతి మాట్లాడుతూ ప్రపంచ ఆదివాసీ దినోత్సవ ఆవశ్యకతను వివరించారు.అనంతరంగిరిజన విద్యార్థినులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. కార్య క్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎగువ దాగరవలసలో డెంగ్యూ కలకలం

● అప్రమత్తమైన వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది


యాంటీ లార్వా ఆపరేషన్ చేయిస్తున్న వైద్యాధికారి శివకుమార్

సాలూరు రూరల్: సాలూరు మండలంలో కొత్తవలస పంచాయతీ పరిధిలో ఉన్న గిరిశిఖర గ్రామం ఎగువ దాగరవలసలో డెంగ్యూ కలకలం నెలకొంది. ఓ కేసును గుర్తించడంతో వైద్యఆరోగ్యశాఖ అప్రమత్తమయ్యింది. దీంతో మామిడిపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డి.శివకుమార్ శనివారం హుటాహుటిన గిరిశిఖర గ్రామానికి చేరుకొని వైద్యసేవలందించారు. గ్రామానికి చెందిన ఓ ఏడు నెలల గర్భిణికి శుక్రవారం కడుపునొప్పి రావడంతో తొలుత సాలూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. గర్భిణి కావడంతో ఆమెను విజయనగరం ఘోషాసుపత్రికి మెరుగైన చికిత్స కోసం అక్కడ నుంచి పంపించారు. ఘోషాసుపత్రిలో ఆమెను పరీక్షించిన వైద్యులు డెంగ్యూగా నిర్ధారించి చికిత్స అందించారు. ఆమెకు సత్వరమే ప్లేట్‌లెట్లు పెరగడం, జ్వరం సైతం అదుపులోకి రావడంతో డిశ్చార్జ్ చేసి గ్రామానికి తరలించారు. గ్రామంలో డెంగ్యూజాడలు కనిపించడంతో పీహెచ్‌సీ వైద్యాధికారి శివకుమార్ ఇంటింటా సర్వేచేశారు.గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించి 30మందికి వైద్యసేవలందించారు. గ్రామంలో యాంటీ లార్వా ఆపరేషన్, పారిశుధ్యపనులు చేయించారు. వ్యాధులపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. గ్రామంలో హెల్త్ విజిట్స్ చేయాలని ఆరోగ్యసిబ్బందిని ఆదేశించారు.

వర్గీకరణ తీర్పును పునఃసమీక్షించాలి

● దళిత సంఘాల నాయకుల డిమాండ్


ర్యాలీ నిర్వహిస్తున్న దళిత సంఘాల నాయకులు

పాలకొండ: ఎస్సీ వర్గీకరణ తీర్పును కేంద్ర ప్రభుత్వం పునఃసమీక్షించాలని దళిత సంఘాల నాయకులు ఎద్దు లిల్లీపుష్పనాథం, నూతులపాటి భరత్ భూషణ్, బత్తిన మోహన్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని కార్గిల్ సెంటర్ నుంచి ఏలాంసెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వరకు ఎస్సీ వర్గీకరణ తీర్పుకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏలాం కూడలిలో మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో లుంబూరు సర్పంచ్ ఉపేంద్రకుమార్, దళిత సంఘాల నాయకులు కొంచాడ జాన్, గణేష్‌బాబు, జీవరత్నం, రామారావు, నాగరాజు, మడపల ప్రసాద్, గురుబిల్లి రవికుమార్, పొట్నూరు రమేష్, ధర్మాన వెంకటరమణ పాల్గొన్నారు.

పాఠశాలల బలోపేతం చేతల్లో చూపించాలి

● బోధనేతర పనులు నుంచి తప్పించాలి

● పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సూర్యనారాయణ

పార్వతీపురం ఆంధ్రజ్యోతి: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడమనేది మాటల్లో కాకుండా చేతల్లో చూపించాలని, అందుకోసం ఉపాధ్యాయ సంఘ నాయకులు సూచనలు, అభిప్రాయాలుతీసుకోవాలని పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సూర్యనారాయణ, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వాలేటి తవిటినాయుడు, కాగాన విజయ్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు భోగ రవికుమార్ ఒక ప్రకటనలో కోరారు.సపోర్టింగ్ ఆంధ్రా లెర్నింగ్ ట్రాన్స్‌ఫ ర్మేషన్ ప్రాజెక్టు అమలుకు సంబంధించి అధికారులతో మాట్లాడిన సమయంలో మంత్రి లోకేష్ ఐదేళ్లలో ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని అధికారులను ఆదేశించడం సంతోషదాయకమని తెలిపారు. జీవో-117 రద్దు ద్వారా మాత్రమే ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం అవుతాయని, యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీని ఈ విద్యా సంవత్సరం నుంచే అమలు చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం అవ్వడం ఒక్క ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందని, అందు కోసం ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తిని తగ్గించాలని, ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఉపాధ్యాయులకు బోధనేతర పనులు నుంచి తప్పించాలని విద్యాశాఖ మంత్రికి విన్నవిస్తున్నామని పేర్కొన్నారు.

కొండవాగుల వద్ద వంతెనలు నిర్మించండి

● వేటగానివలసలో గిరిజనుల నిరసన ర్యాలీ

పాచిపెంట: వర్షాకాలంలో ఉధృతంగా ప్రవహిస్తున్న కొండ వాగుల వద్ద వంతెనలు నిర్మించాలని శనివారం వేటగానివలసలో గిరిజనులు సీపీఎం మండల కార్యదర్శి కోరాడ ఈశ్వరరావు ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం మండల నాయకులు మంచాల శ్రీనివాసరావు, కొర్రాకళ్యాణ్ మాట్లాడుతూ వేటగానివలసకు వెళ్లే రహదారి మార్గమధ్యలో గల కొండ వాగు వద్ద, చిట్యాల సతాబి గ్రామాల మధ్య గల కారుమామిడి గెడ్డ వద్ద వంతెనలు నిర్మించాలని డిమాండ్ చేశారు. వర్షాలు కురిస్తే గెడ్డల ఉధృతి ప్రవాహం వల్ల రాకపోకలు స్తంభించిపోతున్నా యని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో వేటగానివలసలో గల గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు అవస్థలు పడుతు న్నారని వాపోయారు. కారుమామిడి గెడ్డ వల్ల గిరిజనులు నిత్యా వసర సరుకులు తెచ్చుకునేందుకు ఇబ్బందులు పడుతున్నార న్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు కె.అర్జున్, సోను ఎర్రయ్య, పండు, గోపాల్, బి.పోతయ్య పాల్గొన్నారు.



నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న గిరిజన సంఘం నాయకులు